

యువకుడికి తీవ్ర గాయాలు

ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొనడంతో ఓ యువకుడికి తీవ్ర గాయాలైన ఘటన గంగవరం మండలంలో చోటు చేసుకుంది. - IIలో



లేగ దూడలను సంరక్షించాలి

సంకరజాతి లేగ దూడలను సంరక్షించాల్సిన బాధ్యత రైతులపై ఉందని పశుసంవర్ధకశాఖ జేడీ పిలుపునిచ్చారు. - IIలో



వ్యాసరచన పోటీలు

భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శత జయంతి సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. - IIలో

న్యూస్‌రీల్

విద్యుత్ ఉద్యోగులకు సోలార్



చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో విద్యుత్ ఉద్యోగులకు సోలార్ ఏర్పాటు చేసే దిశగా అధికారులు అడుగులు వేస్తున్నారు. ఈ మేరకు ట్రాన్స్‌కో పరిధిలో ఎంతమంది రెగ్యులర్ ఉద్యోగులు ఉన్నారనే అంశాలను సేకరిస్తున్నారు. జిల్లాలో మొత్తం 1,090 మంది ఉద్యోగులు ఉండగా అందులో సోలార్ విధానం 10 శాతం మంది కూడా పెట్టుకోలేదని తెలుస్తోంది. ఈ క్రమంలో అందరికీ సోలార్ ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతున్నారు. వీరితో పాటు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ పొందుతున్న ఎస్సీ, ఎస్టీ సర్వీసుదారులకు ఇంటి పైకప్పుపై సోలార్ ఫలకలు ఉచితంగా ఏర్పాటు చేయనున్నారు. వ్యవసాయ ఫీడర్లకు ప్రత్యేకంగా పీఎం కుసుం పథకం కింద సోలార్ ప్లాంట్స్ పెట్టనున్నారు. జిల్లాలో వీటికి సంబంధించి సర్వే కూడా పూర్తి చేశారు. వెయ్యి ఎకరాల్లో 200 మెగావాట్ల ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకు గాను భూమి పొందడానికి అనుమతులు వస్తే తదుపరి సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు టెండర్లు పిలవనున్నారు. ఇందులో ఉత్పత్తి అయ్యే విద్యుత్ మొత్తం వ్యవసాయ సర్వీసులకు వాడనున్నారు.

ఏఓ సీనియార్టీ జాబితా సిద్ధం



రవికుమార్ నాయుడు, సీఈఓ

చిత్తూరు కార్పొరేషన్: జెడ్పీ, ఎంపీడీఓ కార్యాలయాల పరిధిలో పనిచేస్తున్న ఏఓల సీనియార్టీ జాబితా సిద్ధం చేసినట్టు సీఈఓ రవికుమార్‌నాయుడు తెలిపారు. సోమవారం జెడ్పీ సమావేశ మందిరంలో ఏఓలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిపాలనాధికారుల(ఏఓ) సీనియార్టీ జాబితాలో అభ్యంతరాలు ఉంటే తెలపాలన్నారు. పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, రెవెన్యూ ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని పనిచేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈఓ వెంకటనారాయణ, ఏఓ పాల్గొన్నారు.

పాలక మండలి సభ్యత్వానికి 74 దరఖాస్తులు

చౌడేపల్లి: బోయకొండ గంగమ్మ ఆలయ నూతన పాలక మండలి సభ్యత్వానికి మొత్తం 74 మంది సభ్యుల నుంచి దరఖాస్తులు స్వీకరించినట్లు ఆలయ ఈఓ ఏకాంబరం తెలిపారు. శుక్రవారం రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ ఆధ్వర్యంలో పుంగనూరు కు చెందిన గంగాధర్ అలియాస్ చిన్నరాయల్ అనుచరులతో కలిసి 13 మంది దరఖాస్తులు అందజేశారు. అలాగే మరో నలుగురు సభ్యులు దరఖాస్తులను ఈఓకు అందజేశారు. హరిప్రసాద్ మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో బోయకొండను మరింత అభివృద్ధి చేస్తామన్నారు. నాయకులు కోలా సోముశేఖర్, రామ్‌దాస్‌చౌదరి, నానబాలకుమార్, పగడాల రమణ, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



కలెక్టర్‌కు బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఈఓ పెంచల కిషోర్

చిత్తూరు కలెక్టరేట్ : కాణిపాక శ్రీవరసిద్ధి వినాయక స్వామి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీకి అందజేశారు. ఈ మేరకు శుక్రవారం కాణిపాకం ఆలయ ఈవో పెంచలకిషోర్ కలెక్టర్‌ను కలిసి ఆహ్వాన పత్రిక అందజేసి సాదరంగా ఆహ్వానించారు. ఈనెల 27 నుంచి సెప్టెంబర్ 16వ తేదీ వరకు కాణిపాక ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నామని తెలిపారు. అనంతరం వేద పండితులు కలెక్టర్‌కు ఆశీర్వచనం పలికి ఆలయ తీర్థ ప్రసాదాలను అందజేశారు.

కోర్టుకు హాజరైన పూతలపట్టు ఎమ్మెల్యే

చిత్తూరు అర్బన్: పూతలపట్టు ఎమ్మెల్యే కె.మురళీమోహన్ శుక్రవారం చిత్తూరు కోర్టు ఎదుట హాజరయ్యారు. 2023లో చంద్రబాబు నాయుడిని అరెస్టు చేయగా, మురళీమోహన్ మండలంలో చెట్లను కొట్టి రోడ్డుపై వేసి, శాంతి భద్రతలకు విఘాతం కలిగించారని తవణంపల్లె పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణలో భాగంగా చిత్తూరులోని 8వ అదనపు జిల్లా న్యాయస్థానం ఎదుట హాజరయ్యారు. తదుపరి విచారణను అక్టోబర్ 6వ తేదీకి వాయిదా వేస్తూ న్యాయమూర్తి శ్రీదేవి ఆదేశాలు జారీచేశారు.

ఉన్నది లేనట్లు.. లేనిది ఉన్నట్లు చేయడంలో ఆరితేరిపోయారు.. తిమ్మిని బొమ్మిని చేయడంలో రికార్డులు బద్దలు కొట్టేశారు. తాము చెప్పిందే వేదమని నమ్మించేస్తారు. ప్రజలను తమ వైపు తిప్పుకునేందుకు లేనిపోనివి అల్లేస్తారు. తీరా ఒక అబద్ధాన్ని నిజమని నమ్మించేందుకు ప్రజలకు వినుగొచ్చేవరకు టీవీల్లో దుష్ప్రచారం చేస్తారు.. ఇలాంటిదే శుక్రవారం పుత్తూరులో చోటుచేసుకుంది. మద్యం కుంభకోణం విచారణలో భాగంగా సిట్ బృందం మాజీ డెప్యూటీ సీఎం నారాయణస్వామిని సుదీర్ఘంగా విచారించింది. ఆ సమయంలో కొన్ని మీడియా చానళ్లు చేసిన విషప్రచారాన్ని చూసి తిరుపతి, చిత్తూరు జిల్లాల ప్రజలు ఔరా..? అంటూ ముక్కున వేలేసుకునేలా చేసింది. ఎక్కడ సత్యం.. ఎక్కడ ధర్మం అంటూ చర్చించుకోవడం కనిపించింది.

మీడియాతో మాట్లాడుతున్న రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి



నిజం దాచేస్తూ..

విషం చిమ్ముతూ!

సిట్ విచారణ వేళ పెచ్చు మీరిన పచ్చ మీడియా పైత్యం

- సత్యం వధ..ధర్మం చెర!
- మాజీ డెప్యూటీ సీఎం అప్రూవర్‌గా మారారంటూ దుష్ప్రచారం
- ఇంట్లో నోట్ల కట్టలంటూ వండివార్చిన వైనం
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ని మారుస్తున్నారంటూ తప్పుడు కథనం
- మండిపడ్డ మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

సాక్షి ప్రతినిధి, తిరుపతి: మద్యం కుంభకోణం విషయమై విచారణ కోసం సిట్ బృందం శుక్రవారం ఉదయం 10.30 గంటలకు పుత్తూరుకు చేరుకుంది. మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ఇంటికి చేరుకున్న ఆ బృందం సాయంత్రం 5.30 గంటల వరకు సుదీర్ఘంగా విచారించింది. విషయం తెలుసుకున్న పచ్చమీడియా అక్కడకు ఉరుకులు పరుగుల మీద చేరుకుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు అతస్య కథనాలు.. వార్తలు వండి వార్చింది. కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న కొన్ని టీవీ చానళ్లలో అయితే ఉన్నది లేనట్లు.. లేనిది ఉన్నట్లు నమ్మించే ప్రయత్నం చేయడం జిల్లా ప్రజలను ఆశ్చర్యానికి గురిచేసింది.

నిజం నిప్పులాంటిది

సిట్ విచారణ అనంతరం మాజీ ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి మీడియాతో మాట్లాడారు. 'నిజం నిప్పులాంటిది. దాన్ని ఎవ్వరూ తప్పుబట్టలేరు. ప్రజలను తప్పుదారి పట్టించలేరు' అని తెలిపారు. 'మద్యం విషయం కోర్టులో నడుస్తోంది. కాబట్టి సిట్ బృందం ఇంటికి వచ్చి విచారణ చేట్టింది. అందులో తప్పేముంది. అయితే ఎల్లో మీడియా ప్రజలకు తప్పుడు సందేశాన్ని అందించి తప్పుదారి పట్టించాలని చూస్తోంది. గతంలో మద్యం షాపులను ప్రభుత్వమే నడిపింది. అలాంటప్పుడు అవినీతి ఎలా జరుగుతుంది..? నా రాజకీయ జీవితంలో ఎక్కడా అవినీతికి తావు లేకుండా మచ్చలేని నాయకుడిగా ఎదిగా. 50 ఏళ్లు ప్రజల కోసం సేవ చేశా. నియోజకవర్గంలో ఎక్కడికి వెళ్లినా నేను చేసిన అభివృద్ధి కంటికి కనిపిస్తుంది. అలాంటి వ్యక్తిపై బురద చల్లేందుకు పచ్చమీడియా నాపై నిందలు వేయడం మంచిది కాదు. సాక్ష్యాత్తు శ్రీవేంకటేశ్వర స్వామి సన్నిధిలో చైర్మన్‌గా ఉంటున్న వ్యక్తికి సంబంధించిన చానల్ మరీ దిగజారిపోయింది. అసత్యాలు వండి వారుస్తోంది. మీడియా అంటే నిజాన్ని నిర్భయంగా చెప్పాలిగానీ.. ఇలా అబద్ధపు ప్రచారం చేయడం నేను ఇప్పుడే చూస్తున్నా. విచారణలో ఏమి జరిగిందో ఎవ్వరికీ తెలియక పోయినా అప్పుడే నారాయణస్వామి అప్రూవల్‌గా మారిపోయాడు. ఆయనకు శిక్ష తప్పదని చెప్పడం దారుణం' అని ఆయన పేర్కొన్నారు.



విచారణ సందర్భంగా ఉత్కంఠగా ఎదురు చూస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

మరీ ఇంత బరితెగింపా?



నారాయణస్వామి ఇంటి వద్ద గుమికూడిన కార్యకర్తలు

సిట్ విచారణ సందర్భంగా ఎల్లో మీడియా పచ్చ పైత్యం పెచ్చుమీరింది. మాజీ ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి అప్రూవర్‌గా మారిపోయారని నమ్మించేందుకు పదేపదే ఆ టీవీ చానళ్లలో స్క్రోలింగ్ ఇవ్వడం ప్రారంభించింది. అంతటితో ఊరుకోక ఆయన ఇంట్లో నోట్ల కట్టలు బయటపడుతున్నాయని ప్రజలను మునివేళ్లమీద నిలబెట్టే ప్రయత్నం చేసింది. ఇప్పటివరకు రూ.8 కోట్ల మేర బయటపడిందని.. ఇంకా పెద్ద మొత్తంలో నగదు స్వాధీనం చేసుకునే అవకాశం ఉందని పదేపదే అబద్ధపు ప్రచారం చేయడం మొదలు పెట్టింది. ఆపై ఏకంగా నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఉన్న కృపాలక్ష్మినే మార్చేస్తున్నారంటూ బోల్తాకొట్టించేందుకు ముప్పుతిప్పలు పడింది. దీన్ని జీర్ణించుకోలేని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, జగనన్న అభిమానులు తప్పుడు వార్తలు చూసి ఛీ కొట్టడం కనిపించింది. ఆపై ఎల్లో మీడియా గోబ్యాక్.. పచ్చ పైత్యం నశించాలి అంటూ నినాదాలు చేయడంతో తోకముడవాల్సి వచ్చింది.

శాస్త్రోక్తంగా రాహుకాల అభిషేక పూజలు





బోయకొండలో ప్రత్యేక పూజలందుకున్న అమ్మవారు, ఆలయంలో భక్తుల రద్దీ

చౌడేపల్లి: బోయకొండ గంగమ్మ ఆలయంలో అమ్మవారికి శుక్రవారం రాహుకాల అభిషేక పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాహుకాల సమయం 10.30 నుంచి 12 గంటల వరకు అర్చనలు, అభిషేక పూజలు చేశారు. శ్రావణమాసపు చివరి శుక్రవారం సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా బంగారు నగలు, పూలతో ముస్తాబుచేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు ఉపవాస దీక్షలతో తరలివచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఈఓ ఏకాంబరం ఆధ్వర్యంలో ఉభయదారులకు పవిత్ర తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

గంగమ్మా.. కూటమికి మంచి బుద్ధి ప్రసాదించమ్మా!

చౌడేపల్లె: గంగమ్మ తల్లీ... కూటమి ప్రభుత్వానికి మంచి బుద్ధిని ప్రసాదించమ్మా..! అంటూ కొండామర్రి గ్రామంలో వెలసిన గ్రామదేవత నడివీధి గంగమ్మకు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు నాగభూషణరెడ్డి, ఎంపీటీసీ షాహీనల ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులతో కలిసి రాజంపేట ఎంపీ పీవీ.మిథున్‌రెడ్డి అక్రమ అరెస్ట్ నుంచి త్వరగా విడుదల కావాలని కోరుతూ ఆలయంలో ప్రత్యేక అర్చనలు, అభిషేక పూజలు చేశారు. నాగభూషణరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబంపై కక్ష పూరితంగా వ్యవహరిస్తోందన్నారు. గ్రామ స్థాయి నుంచి కూటమి వైఫల్యాలను ప్రజలకు తెలియజేస్తామన్నారు. బోయకొండ మాజీ చైర్మన్ మిద్దింటి శంకర్ నారాయణ, మాజీ ఎంపీపీ రుక్మిణమ్మ, సర్పంచుల సంఘ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, మండల పార్టీ ఉపాధ్యక్షుడు వెంకటరమణ, నాయకులు షంషీర్, హస్సేన్, శ్రీరాములు, టి.నాగరాజ, జీఆర్ఎస్ రమణ, సాధిక్, గిరిబాబు, మునికృష్ణమనాయుడు, చెంగారెడ్డి, రంగనాథ్, మోహన్‌రెడ్డి, బాబు, భరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చౌడేపల్లె: కొండామర్రి గ్రామదేవత నడివీధి గంగమ్మ ఆలయంలో ఎంపీ మిథున్‌రెడ్డి విడుదల కావాలని కోరుతూ పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

విలపింఛన్

దివ్యాంగులపై కూటమి కక్ష

- జిల్లాలో పలువురి పింఛన్ల తొలగింపు
- ఇప్పటికే నోటీసులు జారీ
- కన్నీరుమున్నీరవుతున్న అభాగ్యులు
- పట్టించుకోని కూటమి నేతలు

కూటమి ప్రభుత్వానికి కనికరం లేకుండా పోతోంది. పింఛన్ సొమ్ముతో బతుకులీడుస్తున్న దివ్యాంగులను ముప్పుతిప్పలకు గురిచేస్తోంది. రీవెరిఫికేషన్ పేరుతో చుక్కలు చూపిస్తోంది. పింఛన్లు తొలగించి వారి పొట్టగొట్టేందుకు పన్నాగం పన్నింది. ఇక తాము ఎలా బతికేది దేవుడా..! అంటూ పలువురు నిట్టూర్పులు వెళ్లగక్కాల్సి వస్తోంది. కుటుంబానికి భారం కాకుండా ఇన్నాళ్లూ బతికామని, ఇక తమకు చావే శరణ్యమని దివ్యాంగులు గగ్గోలు పెట్టాల్సిన దుస్థితి ఏర్పడింది. నడవలేని స్థితిలో ఉన్నా కలెక్టరేట్, మండల కేంద్రాలకెళ్లి గళమెత్తాల్సి వస్తోంది. అయినా కూటమిలో చలనం లేకపోవడం విమర్శలకు తావిస్తోంది.

– చిత్తూరు కలెక్టరేట్/ నగరి

మా కడుపు కొట్టొద్దయ్యా!

యాదమరి: దివ్యాంగుల పొట్టగొట్టొద్దంటూ పలువురు వేడుకుంటున్నారు. రీవెరిఫికేషన్‌లో వికలత్వ శాతం తగ్గి నోటీసులందుకున్న బాధితులు ఎంపీడీఓ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. తమకు పింఛన్లు రాకుంటే చావే శరణ్యమని కన్నీళ్లు పెట్టుకుంటున్నారు.

దిక్కుతోచడం లేదు



- ఇక్కడ చిత్రంలో ఉన్న వ్యక్తి పేరు సురేష్‌బాబు. కీనాటంపల్లెకు చెందిన ఇతడికి దాదాపు పదేళ్లుగా దివ్యాంగ పింఛను వస్తోంది. సదరం సర్టిఫికెట్‌లో 89శాతం వైకల్యమని వైద్యులు ధ్రువీకరించారు. అయితే కూటమి ప్రభుత్వం రీ-సర్వేలో 40శాతం మాత్రమే వైకల్యం ఉందని, ఇక మీదట పింఛను రాదని అధికారులు చెప్పడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డాడు. పింఛను రాకుంటే వీధిన పడడం ఖాయమని వాపోయాడు.

అంధుడినయ్యా..



- ఈ చిత్రంలోని వ్యక్తి పేరు సోమయ్య. కృష్ణంపల్లె నివాసి. అంధుడైన ఇతను కుటుంబ సభ్యుల సహాయంతోనే ఎక్కడికైనా వెళ్లాల్సి వస్తోంది. 75 శాతం వైకల్యం ఉంది. ఇతని పింఛనుకు సైతం కూటమి ప్రభుత్వం ఎసరు పెట్టింది. పింఛను సొమ్మును వైద్యం, కుటుంబ పోషణకు వినియోగించేవాడు. ఇప్పుడు రద్దు చేయడంతో పింఛను పునరుద్ధరించండి మహాప్రభో అని తన భార్య సాయంతో కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాడు.

మాపై ఎందుకింత కక్ష?



- ఈ చిత్రంలో కనిపిస్తున్న దివ్యాంగుని పేరు షామీర్‌బాషా. ఈయన జిల్లాలోని బంగారుపాళ్యం మండలంలో నివసిస్తుంటారు. 2014 నుంచి పింఛన్ పొందుతున్నారు. అయితే కూటమి ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన సర్వేలో షామీర్‌బాషా పింఛన్‌ను తొలగించారు. ఆ మేరకు ఎంపీడీవో నోటీసు పంపారు. కలెక్టరేట్‌కు విచ్చేసి ఇటీవల వినతిపత్రం అందజేశారు. పరిశీలనకు విచ్చేసిన డాక్టర్లు కనీసం ఎలాంటి పరీక్షలు చేయలేదని బాధితుడు వాపోయారు. కూటమి ప్రభుత్వానికి తమపై ఎందుకింత కక్ష అంటూ షామీర్ బాషా ఆవేదనకు లోనయ్యారు. – చిత్తూరు కలెక్టరేట్

మా పొట్టగొట్టొద్దు



- మాకు ఈ ప్రభుత్వం ఎందుకింత అన్యాయం చేస్తోందో అర్థం కావడం లేదు. మేమేం అన్యాయం చేశామని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాం. ఎన్నో సంవత్సరాలుగా పింఛన్ తీసుకుంటున్నాను. ఇప్పుడేమో నేను అనర్హురాలని తేల్చారు. నడిచే స్థితిలో కూడా లేను. ఇంత కాలం అర్హత లేకుండానే పింఛన్ తీసుకున్నానా. మేలు చేయాల్సిన ప్రభుత్వం తమ పొట్టగొడుతోంది. కనీసం మమ్మల్ని చూస్తే జాలి దయ కూడా కలగడం లేదా..?

– భాను, దివ్యాంగురాలు, బంగారుపాళ్యం

రూ.6 వేలకు తగ్గించేశారు



- నాకు 85 శాతం అంగవైకల్యం ఉంది. ఈ విషయాన్ని డాక్టర్లు పలు పరీక్షలు చేసి ధ్రువీకరించారు. సదరం సర్టిఫికెట్ కూడా ఇచ్చారు. గత పదిదేళ్లు దివ్యాంగుల పింఛన్‌ను తీసుకుంటున్నా. ఇటీవల కొంతమంది ఉద్యోగులు ఇంటికొచ్చి అర్హత పరీక్ష అని చెప్పారు. తర్వాత ఎలాంటి పరీక్షలు చేయలేదు. ఏదో రాసుకుని వెళ్లిపోయారు. కొద్ది రోజుల తర్వాత పింఛన్ రూ.6 వేలకు తగ్గిస్తున్నామని నోటీసు ఇచ్చారు. నాలాంటోళ్ల కడుపు కొట్టి పింఛన్‌లో కోత విధించడం అన్యాయం. మాకున్న అర్హతను బట్టే కదా ఇన్ని రోజులు పింఛన్‌లు ఇచ్చారు. ఇప్పుడెందుకు కొత్త నిబంధనలు పెట్టి అన్యాయంగా కోతలు కోస్తున్నారు..?

– ఏకాంబరం, పుల్లూరు గ్రామం, ఐరాల మండలం.

పింఛన్ తీసేశారు



- ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు రాణెమ్మ. నగరి మున్సిపాలిటీ కరకంతాపురం గ్రామంలో నివాసముంటోంది. ఈమె 68 శాతం (వెన్నుపూస సమస్య) దివ్యాంగురాలు. ఈమె సదరం క్యాంపునకు వెళ్లగా రీ వెరిఫికేషన్‌లో 40 శాతం లోపు వికలత్వం ఉందని డాక్టర్లు తేల్చారు. ఇప్పటికే అధికారులు నోటీసులు కూడా అందించారు. తనకు ఆదరణగా ఉన్న పెన్షన్‌ను తీసేయడంతో ఆమె ఆవేదనకు లోనవుతున్నారు.

నడవలేను



- ఈ ఆమె పేరు హేమావతి. గుడిపాల మండలంలోని మరకాలకుప్పానికి చెందిన వారు. చిన్నప్పటి నుంచి కాళ్లు, చేతులు చొచ్చుబడి పోయాయి. నడవలేని పరిస్థితి. ఈమెకు వస్తున్న రూ.15 వేల పింఛనును రూ.6 వేలకు కుదించారు. మందులు, మాత్రలకు నెలకు సుమారు రూ.5 వేల వరకు ఖర్చవుతుంది. ఎంపీడీవో కార్యాలయంలో రీవెరిఫికేషన్ కోసం కుటుంబ సభ్యుల సాయంతో ఆటోలో కార్యాలయానికి వచ్చింది. డాక్టర్ చూసి జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేశారు.

యువకుడికి తీవ్ర గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు

గంగవరం: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు.. పెద్దపంజాణి మండలం, పట్టగాణిపల్లి గ్రామానికి చెందిన వెంకటేష్ కుమారుడు మంజు(17) ద్విచక్ర వాహనంలో కల్లుపల్లి గ్రామానికి వచ్చాడు. అక్కడి నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా పుంగనూరు నుంచి పలమనేరు వైపు వెళ్తున్న స్కార్పియో కారు కల్లుపల్లి చెక్‌పోస్టుకు సమీపంలో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో యువకుడి తల, శరీర భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడ్ని చికిత్స నిమిత్తం పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. యువకుడి పరిస్థితి విషమించడంతో వేలూరు సీఎంసీకి రెఫర్ చేశారు. ప్రమాదంలో కారు ముందు భాగం, ద్విచక్ర వాహనం పూర్తిగా ధ్వంసమయ్యాయి. ప్రమాదానికి కారణమైన కారుని సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

చిత్తూరు కలెక్టరేట్ : భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శతవర్ష జయంతి వేడుకలను పురస్కరించుకుని విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు సత్యసాయి సేవా సంస్థల సంఘం జిల్లా అధ్యక్షుడు మధుసూదనం తెలిపారు. ఆయన శుక్రవారం ఆ సంఘ నాయకులతో కలిసి డీఐఈవో రఘుపతి, డీఈవో వరలక్ష్మిని కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సెప్టెంబర్‌లో పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో చదివే విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహిస్తామన్నారు. ఉన్నత పాఠశాలల విద్యార్థులకు కర్తవ్యమే దైవం (తెలుగు మీడియం), డ్యూటీ ఈస్ గాడ్ (ఇంగ్లిష్ మీడియం), జూనియర్ కళాశాల విద్యార్థులకు రేపటి భవిష్యత్ నేడు మన చేతిలోనే ఉంది (తెలుగు మీడియం), ది ఫ్యూచర్ డిపెండ్స్ ఆన్ వాట్ వ్యూ డు అట్ ప్రెసెంట్ (ఇంగ్లిష్ మీడియం)లో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామన్నారు. డిగ్రీ కళాశాలల విద్యార్థులకు ప్రపంచంలో పరివర్తన మార్పు రావాలంటే, ముందు నీలో మార్పు రావాలి (తెలుగు మీడియం), ట్రాన్స్‌ఫార్మ్స్ యువర్ సెల్ఫ్ టూ ట్రాన్స్‌ఫార్మ్ ది వరల్డ్ (ఇంగ్లిష్ మీడియం) వ్యాసరచన పోటీలుంటాయన్నారు. ఈ పోటీల నిర్వహణ తేదీలు త్వరలో వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు 9440690137లో సంప్రదించాలని ఆయన కోరారు. సభ్యులు శంకర్, గజేంద్రరెడ్డి, శేషనారాయణ, కృష్ణమనాయుడు తదితరులు పాల్గొన్నారు.

దమ్ముంటే పట్టుకోండి?

- చిత్తూరు మండలం, అనంతాపురం గ్రావిటా ఫ్యాక్టరీ వద్ద గురువారం మధ్యాహ్నం ఓ లారీ టైర్ పేలి నిలిచిపోయింది. అటుగా వెళ్లిన గ్రామస్తులు లారీ కింది భాగంలో నీళ్లతో కూడిన ఇసుక రాలడంతో అనుమానం కలిగింది. లారీపైన కప్పిన పట్ట విప్పి చూస్తే అసలు విషయం బయటపడింది. ఇసుకపై వరి పొట్టు బ్యాగులు నింపి సరిహద్దు దాటిస్తున్నట్లు గుర్తించారు. దీనిపై పోలీసులు కేసు కూడా నమోదు చేశారు. ఈ లారీ తిరుపతి జిల్లా, గూడూరు ప్రాంతం నుంచి తమిళనాడుకు వస్తున్నట్టు పోలీసులు గుర్తించారు.
- ఆరు నెలలకు క్రితం గూడూరు నుంచి చిత్తూరు మండలం మీదుగా వెళుతున్న ఇసుక లారీని పోలీసులు పట్టుకున్నారు. బీఎస్‌ఆర్‌పేట చెక్‌పోస్టు వద్ద పట్టుకుని కేసు నమోదు చేశారు. నెల్లూరుకు చెందిన ఓ వ్యక్తితో పాటు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు.
- గంగాధరనెల్లూరు మండలంలో మూడు నెలలకు ముందు గూడూరు నుంచి తమిళనాడుకు అక్రమంగా తరలుతున్న ఇసుక లారీని పట్టుకున్నారు. జరిమానా వేసి వదిలేశారు. అలాగే గుడిపాల మండలంలో కూడా రెండు నెలలకు క్రితం ఓ లారీ పట్టుబడింది. తమిళనాడుకు వెళ్తున్న క్రమంలో పట్టుకున్నారు. కానీ జరిమానా వేసి పంపించేశారు.

..జిల్లాలో ఇలాంటివి నిత్యకృత్యంగా మారాయి. అధికార మదంతో కూటమి నేతలు అందినకాడికి ఇసుక తరలించేస్తున్నారు. సరిహద్దులు దాటించి జేబులు నింపుకుంటున్నారు. పోలీసులు కేసులు, జరిమానాలతో చేతులు దులుపుకుంటున్నారు. కానీ ఎవరిపైనా చర్యలకు ఉపక్రమించే ధైర్యం చేయలేకపోతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.



ఇసుక డంప్(ఫైల్)

పుష్ప రేంజ్‌లో కూటమి నేతల ఇసుక వ్యాపారం

- గూడూరు నుంచి చిత్తూరు మండలం మీదుగా తమిళనాడుకు తరలింపు
- పట్టించుకోని మైనింగ్‌శాఖ అధికారులు

సాక్షి టాస్క్‌ఫోర్స్: చిత్తూరు మండలం తమిళనాడు సరిహద్దుకు ఆనుకుని ఉంది. మండలం మీదుగా రాకపోకలు సులభతరంగా ఉంటాయి. బంగారెడ్డిపల్లి గ్రామం వద్ద ఎంట్రీ ఇస్తే.. బీఎస్‌ఆర్‌పేట మీదుగా జిల్లా సరిహద్దును 15 నుంచి 20 నిమిషాల వ్యవధిలో దాటేయొచ్చు. తమిళనాడు సరిహద్దులోకి చేరుకుంటే పొన్నై, సోలింగరం, తిరుత్తణి మీదుగా చైన్నైకి దూసుకెళ్లవచ్చు. మళ్లీ చిత్తూరు మండలం నుంచి గుడిపాల మండలం మీదుగా తమిళనాడుకు చేరుకోవచ్చు. లేకుంటే కమ్మతిమ్మపల్లి మీదుగా తమిళనాడులో అడుగుపెట్టవచ్చు.

అలాగే జీడీనెల్లూరు మండలం మీదుగా వస్తే..తూగుండ్రం నుంచి పొన్నైకు చేరుకుని బండిని చెన్నైకి తిప్పొచ్చు. దీనికి తోడు దొడ్డిదారులను అక్రమార్కులు ఎంచుకుని సరిహద్దులు దాటిస్తున్నారు.

ఇక్కడి నుంచే

గూడూరు కేంద్రంగా ఇసుక వ్యాపారం జోరందుకుంటోంది. నెల్లూరు జిల్లాలోని పెన్నానదిలో తవ్వకాలు చేసి గూడూరులో డంప్ చేసుకుంటున్నారు. అలాగే గూడూరు పరిధిలోని స్వర్ణముఖి నదిలో కూడా ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. ఇక్కడ లారీలో ఇసుక నింపి.. పుష్పారేంజ్‌లో ఇసుకను తమిళనాడుకు చేర్చే ప్ర యత్నం చేస్తున్నారు. వరిపొట్టు, వరి, కూరగాయలు, బియ్యం, నిత్యావసర సరుకులు తదితర పేర్లతో వేబిల్లులు వేసుకుని చిత్తూరు మండలం, జీడీనెల్లూరు, గుడిపాల మీదుగా తమిళనాడు చేరుస్తున్నారు.

తమిళనాడు వ్యక్తులతోనే వ్యాపారం


గూడూరులో జరిగే ఇసుక తవ్వకాల్లో తమిళనాడుకు చెందిన వ్యక్తులే కీలకంగా పనిచేస్తున్నారు. లారీకి ఇసుక నింపడం నుంచి తమిళనాడు రాష్ట్రంలో ఇసుక దింపే వరకు ఆ రాష్ట్ర వాసులే దగ్గరుండి పనిచేస్తున్నారు. కూటమి నేతలు తమిళనాడు కూలీలను నమ్మకంగా పెట్టుకుంటున్నారు. వీళ్లు తమిళనాడులోని ఇసుక దందాదారులతో చేతులు కలిపి అమ్మకాలు చేస్తున్నారు. లారీ ఇసుక రూ.లక్ష నుంచి రూ.2లక్షల వరకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. వీరందరికీ నెల్లూరులోని ఓ కూటమి నేత బాస్‌గా వ్యవహరిస్తున్నట్టు సమాచారం.

నిఘా ఏదీ?

చిత్తూరు, గుడిపాల, జీడీనెల్లూరు మండలాల మీదుగా జరుగుతున్న ఈ ఇసుక దందాను అరికట్టడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. క్షేత్ర స్థాయిలోని గ్రామస్తులు పట్టిస్తే తప్ప అధికారులు కదలడం లేదు. సరిహద్దు ప్రాంతాల్లో కూడా నిఘా లేదు. దీనికారణంగా అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ఒక వేళ పట్టుకున్నా కేసులు.. జరిమానాలతో సర్దేస్తున్నారు. ఇక ఇసుక పట్టుకుంటే బడా కూటమి నేతల నుంచి అధికారులకు ఫోన్లు వస్తున్నాయి. కొందరైతే ఏకంగా బెదిరింపులకు దిగుతున్నారు. ఈ క్రమంలో అధికారులు ఇసుక లారీలను వదిలిపెట్టాల్సి వస్తోంది.

రెండు జిల్లాల అధికారుల సహకారంతోనేనా..?

ఈ అక్రమ ఇసుక వ్యాపారానికి తిరుపతి, చిత్తూరు జిల్లాల అధికారులు పూర్తి సహాయసహకారాలు అందిస్తున్నట్టు సమాచారం. అందులో భాగంగానే ఈ అక్రమ వ్యాపారం గూడూరు నుంచి తమిళనాడుకు విస్తరించింది. ఇసుకాసురులుగా అవతామెత్తిన కూటమి నేతలకు తమిళనాడు రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద నెట్‌వర్క్ ఉంది. ఈ నెట్‌వర్క్‌తోనే ఈ అక్రమ వ్యాపారాన్ని జోరుగా నడిపిస్తున్నారు.



గూడూరు నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తూ చిత్తూరు మండలంలో పట్టుబడ్డ లారీ(ఫైల్)

కూటమి నేతల బారి నుంచి రక్షించండి

సాక్షి టాస్క్‌ఫోర్స్: కూటమి సానుభూతిపరుల దౌర్జన్యం పెచ్చుమీరుతోందని, వారి బారి నుంచి తమను రక్షించాలని యాదమరి మండలం, లగడపాటూరు గ్రామానికి చెందిన చిన్నబ్బ ఆవేదన వ్యక్తం చేసారు. భాధితుని కథనం.. తమ గ్రామంలో సర్వే నం.29-8బీలో పూర్వీకుల నుంచి వ్యవసాయం చేసుకుని జీవనాన్ని కొనసాగిస్తున్నాం. అయితే అదే గ్రామానికి చెందిన కూటమి సానుభూతిపరుడు, మాజీ సర్పంచ్ సుబ్రహ్మణ్యం కుమారులు తమ పొలంలోకి వెళ్లనివ్వకుండా అడ్డగిస్తున్నారు. శుక్రవారం ట్రాక్టర్ల సహాయంతో మట్టిని తరలించి పొలం మధ్యలో దారి ఏర్పాటుకు యత్నించారు. దీనిపై ప్రశ్నిస్తే మాజీ సర్పంచ్ కుమారులు రుద్రయ్య, శివకుమార్ తమపై దాడి చేశారని బాధితులు ఆరోపించారు. ఈ విషయంపై డయల్ 100 కాల్ చేయగా ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు, ఆపై కొద్దిసేపటికే జేసీబీ యంత్రాలతో పనులు మొదలు పెట్టారని చెప్పారు. దీనిపై తహసీల్దార్ స్పందించి న్యాయం చేయాలని కోరారు.



జేసీబీ యంత్రాలతో దారి ఏర్పాటు చేస్తున్న దృశ్యం

ఎంపీ మిథున్‌రెడ్డి విడుదలవ్వాలని పూజలు

వి.కోట: ఎంపీ మిథున్‌రెడ్డికి బెయిల్ రావాలని ఆయన అభిమాని అన్నవరం శ్రీ రాఘవేంద్రస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, మేజర్ పంచాయతీ 5వ వార్డు మెంబరు కుమార్‌రాజా ఈ నెల 19వ తేదీన స్థానిక శ్రీవీరాంజనేయస్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తన బైక్‌పై దాదాపు 980 కి.మీ ప్రయాణించి అన్నవరానికి చేరుకున్నారు. అక్కడ ఎంపీ మిథున్‌రెడ్డి త్వరగా విడుదలవ్వాలని ప్రత్యేక పూజలు చేశారు. కుమార్‌రాజా గతంలోనూ మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన పాదయాత్ర దిగ్విజయంగా పూర్తి కావాలని తిరుమలకు పాదయాత్ర చేపట్టారు. తర్వాత జగనన్నను కలిసి తిరుమలకు వెళ్లి మొక్కు చెల్లించారు. కుమార్‌రాజా మాట్లాడుతూ మాజీ మంత్రి పెద్దిరెడ్డి కుటుంబంపై కూటమి ప్రభుత్వం కక్షగట్టిందన్నారు. ఇందులో భాగంగానే ఆయన తనయుడు, ఎంపీ మిథున్‌రెడ్డిపై తప్పుడు కేసులు బనాయించినట్టు ఆరోపించారు.





అన్నవరంలో మిథున్‌రెడ్డి ఫొటోతో కుమార్‌రాజా, గత సోమవారం అన్నవరానికి బయల్దేరుతూ..

సంకరజాతి లేగ దూడలను సంరక్షించాలి

తవణంపల్లె: సంకరజాతి లేగ దూడలను సంరక్షించాలని పశుసంవర్ధక శాఖ జేడీ మహ్మద్ అరీఫ్ తెలిపారు. శుక్రవారం పశు గణాభివృద్ధి సంస్థ సౌజన్యంతో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సంకరజాతి లేగ దేడల ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శనలో 130 దూడలను పాడి రైతులు ప్రదర్శించారు. లేగ దూడలను పశుసంవర్ధక శాఖ అధికారులు పరిశీలించారు. తక్కువ వయస్సులో ఎక్కువ ఎదుగుదల, జాతి లక్షణాలు పరిశీలించి ఉత్తమ లేగ దూడలను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. దూడలకు లవణమిశ్రమం, నట్టల నివారణ మందు, మల్టీవిటమిన్ సిరప్‌లను అందజేశారు. అదే విధంగా పాడి రైతులకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రవిచంద్రారెడ్డి, డాక్టర్లు వాసు, సుబ్బారావు, శ్రీధర్, పినాకపాణి, లావణ్య, యోగానంద్, గోపాలమిత్ర తులసీపతి, చంద్రశేఖర్, రమేష్ పాల్గొన్నారు.

డ్రైవర్లకు స్వల్ప గాయాలు



మొగిలి కూడలి వద్ద ఢీకొన్న వాహనాలు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి వద్ద శుక్రవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. శ్రీనిపుడ్ ఫ్యాక్టర్ సమీపంలో గల మొగిలి కూడలి వద్ద టాటా ఏస్ వాహనం, కారు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో టాటా ఏస్ వాహనం బోల్తాపడింది. ఈ ఘటనలో డ్రైవర్లకు స్వల్ప గాయాలయ్యాయి. కారు ముందు భాగం దెబ్బతింది. హైవే మొబైల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గురైన వాహనాలను తొలగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బావిలో పడి వ్యక్తి మృతి

గంగవరం: ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి బావిలో పడిన ఘటన శుక్రువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. పలమనేరు పట్టణం, పత్రమున స్వామి వీధికి చెందిన శ్రీనివాస్(49) గంగవరం మండలం, ఎద్దుల చెరువు కట్ట ఆనుకుని ఉన్న పొలాల వద్ద వ్యవసాయ పనులు చేసుకుంటూ అక్కడే ఉండేవాడు. అయితే పొలానికి ఆనుకుని పాడుబడ్డ బావిలో ప్రమాదవశాత్తు పడి మరణించాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బావి నుంచి వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మరింత లోతుగా విచారణ!

చిత్తూరు కార్పొరేషన్: సచివాలయ జేఎల్‌ఎం గ్రేడ్-2(లైన్‌మెన్ల) పరిస్థితి అయోమయంగా మారింది. విధి నిర్వహణలో నిర్లక్ష్యం తదితర కారణాలతో గురువారం చిత్తూరు అర్బన్ డివిజన్ పరిధిలోని ఐదుగురు జేఎల్‌ఎంలను కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. దీనిపై మరింత లోతుగా దర్యాప్తు చేయనున్నారు. ఈ మేరకు జిల్లాలో కళాశాలకు వెళుతున్న జేఎల్‌ఎంల వివరాలు సేకరించే పనిలో పడ్డారు.

అనుమతి లేకుండా కళాశాలకు

సంఘం నాయకుల పేరిట కొందరు జేఎల్‌ఎంలు అతిగా వ్యవహరించేవారన్న విమర్శలున్నాయి. చిత్తూరు డివిజన్ పరిధిలో ఐదుగురు జేఎల్‌ఎంలు అధికారుల అనుమతి లేకుండానే రాత్రి పూట కళాశాలలో చేరారు. ఆ విషయం చెప్పకుండా కళాశాలకు వెళ్లడానికి విద్యుత్ అధికారులు అనుమతి ఇవ్వడం లేదని నేరుగా జేసీ, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కళాశాలలో చేరిన విషయం దాచిపెట్టి, అధికారుల పైన ఫిర్యాదులు చేయడంతో కలెక్టర్ ఆగ్రహానికి లోనయ్యారు. తీరా విచారణలో వారు కళాశాలలో చేరినట్లు తెలిసి సస్పెండ్ చేశారు. ఇప్పుడు జిల్లాలో ఇలా ఎంత మంది ఉన్నారో విచారించే పనిలో అధికారులు ఉన్నారు. మొత్తం జిల్లాలో డివిజన్ల వారీగా చిత్తూరు అర్బన్ -109, రూరల్-73, పుంగనూరు-103 కలిపి మొత్తం 285 మంది జేఎల్‌ఎంలు విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో ఎంత మంది కళాశాలల్లో చేరారనే విషయంపై ఆరా తీస్తున్నారు.

తదుపరి చర్యలు ఏఈలపైన?

ఇదిలావుండగా ఇప్పటికే వర్క్ ఆర్డర్లు క్లోజ్ చేయకపోవడంతో పలువురు ఏఈలను అవి పూర్తి చేసేవరకు విధుల నుంచి పక్కన పెట్టారు. అవగాహన లేని సబ్‌ఇంజినీర్లు ఇన్‌చార్జ్‌లుగా రాజ్యమేలుతున్నారు. కళాశాలకు వెళ్లడానికి ఏఈలు జేఎల్‌ఎంలకు అనుమతి ఇచ్చి ఉంటే ఆ విషయాన్ని ఉన్నతాధికారుల వద్ద ఎందుకు దాచారు..? అనుమతివ్వకపోతే సెక్షన్ పరిధిలోని సచివాలయంలో పనిచేస్తున్న ఉద్యోగి ఏమి చేస్తున్నాడో..? అనే అంశం ఎందుకు తెలుసుకోలేకపోయారు.? అనే అంశాల పై విచారించనున్నారు.

మీ అంతు చూస్తాం

- ఆఫీసు విషయాలు ఎవరు బయటకు చెబుతున్నారో తేలుస్తాం
- మిమ్మల్ని ఎవ్వరూ కాపాడలేరు!
- ఆరోగ్యశాఖ అధికారుల బెదిరింపులు

సాక్షి టాస్క్‌ఫోర్స్: 'మేము..మేము ఎప్పటికైనా ఒకటి. మీ అంతు చూస్తాం. ఆఫీసు విషయాలు ఎవరో చేరవేస్తున్నారు. నోరు మూసుకుని పడి ఉండండి' అంటూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖలోని ఇద్దరు అధికారులు అంటెడర్లను బెదిరించారు. ఈ నెల 13వ తేదీన సాక్షి దినపత్రికలో 'సిబ్బందితో సొంత పనులు' శీర్షికన వార్త ప్రచురితమైంది. దీనిపై ఆ శాఖ అధికారులు విచారణ చేపట్టారు. ఆ సూపర్‌మన్ అధికారి ఇంటికి ఇంటా..వంటా పనికి వెళుతున్న వారు ఎవరు? అంటూ ఆరా తీశారు. అయితే ఆ అధికారికి కార్యాలయంలోని విచారణ చేసిన అధికారి, ఈ సూపర్‌మన్ అధికారి గతంలో ఓ చోట పనిచేశారని.. ఆ బంధం ఆ అధికారి చేసిన తప్పును కప్పిపుచ్చేసింది. అప్పుడెప్పుడో..ఆ పనులు చేయించారని..ఇప్పుడు ఏం లేదంటూ తొసిపుచ్చారు. అప్పటి నుంచి పగబట్టిన ఆ అధికారి అటెండర్లపై చిందులేస్తున్నారు. ఎవరు చెప్పారో తెలుసుకోవడానికి.. అందరినీ ఇబ్బందులకు గురిచేస్తున్నారని పలువురు సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటా..వంటా పనిపై ఎవరైనా అడిగితే చెప్పొద్దని, లేకుంటే జీతాలు రావని భయపెట్టారని వారు వాపోతున్నారు. ఈ సూపర్‌మన్ అధికారికి మరో అధికారి కూడా తోడై... వత్తాసు పలకడంతో అటెండర్లపై బెదిరింపులు ఎక్కువయ్యాయని వారు కన్నీరుమున్నీరవుతున్నారు. మేము ఎప్పటికైనా ఒక్కటేనంటూ వత్తాసు పలుకుతున్న అధికారి అటెండర్లకు చెప్పుకొచ్చారని సమాచారం. ఈ విషయాన్ని బయటకు ఎవరు చెప్పారో.. తేల్చకుండా వదలమని. ఆఫీసు విషయాలు ఎలా బయటకు చెబుతారంటూ మండిపడినట్లు తెలిసింది.

న్యాయం చేయకపోతే ఆత్మహత్యే శరణ్యం

- ఆర్డీవో కార్యాలయం ఎదుట మండుటెండలో భూ బాధితుడు నాగభూషణం నాయుడు ధర్నా



ఆర్డీవో కార్యాలయంలో సర్వే అధికారితో సమస్యను వివరిస్తున్న బాధితుడు నాగభూషణం

చిత్తూరు కలెక్టరేట్ : తన భూ సమస్యకు న్యాయం చేయకపోతే ఆత్మహత్యే శరణ్యమని జిల్లాలోని ఐరాల మండలం, పందికొట్టూరు గ్రామానికి చెందిన భూ బాధితుడు నాగభూషణం నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. తన భూ సమస్య పరిష్కారం కోసం ఆయన శుక్రవారం చిత్తూరు ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సీఎం చంద్రబాబునాయుడు ఫొటోతో కూడిన బ్యానర్‌ను చేతబట్టి గంటల తరబడి మండుటెండలో ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఐరాల మండలం, పందికొట్టూరు గ్రామంలో సర్వే నం.1527/1 లో 4.02 ఎకరాల భూమి ఉందన్నారు. ఆ భూమిలో తనకు రెండు ఎకరాలు చెందుతుందన్నారు. ఆ రెండు ఎకరాల భూమి తన పూర్వీకుల నుంచి తమ అనుభవంలో ఉన్నట్లు తెలిపారు. అయితే మొత్తం భూమిని తమ బంధువులు ఆక్రమించారని చెప్పారు. న్యాయం కోసం పలుమార్లు అధికారుల వద్దకు తిరుగుతున్నప్పటికీ ఎలాంటి స్పందనా లేదన్నారు. సీఎం చంద్రబాబు నాయుడుకు సైతం అర్జీ ఇచ్చానని తెలిపారు. అయినప్పటికీ క్షేత్రస్థాయి అధికారులు పట్టించుకోలేదన్నారు. కలెక్టర్ ఆదేశించినప్పటికీ చిత్తూరు ఆర్డీవో కార్యాలయం సర్వే అధికారులు న్యాయం చేయలేదన్నారు. తప్పుడు నివేదికలు ఇచ్చి మోసం చేస్తున్నట్లు ఆరోపించారు. న్యాయం చేయకపోతే సీఎం కార్యాలయం ఎదుట ఆత్మహత్య చేసుకుంటానని కన్నీటిపర్యంతమయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు బాధితుని వద్దకు వచ్చి ధర్నా విరమింపజేశారు. అనంతరం సర్వే అధికారుల వద్దకు తీసుకెళ్లి ఆయన సమస్య పరిష్కారానికి చేపట్టాల్సిన అంశాలను చర్చించారు. దీంతో భూ బాధితుడు తాత్కాలికంగా ధర్నా విరమించారు.



సీఎం ఫొటో ప్లకార్డుతో మండుటెండలో ధర్నా చేస్తున్న భూ బాధితుడు నాగభూషణం నాయుడు

మార్పులు చేయాలి



ఏడీకి వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : మూల్యాంకన పుస్తకాల విధానంలో మార్పులు చేయాలని ఏపీటీఎఫ్ 1947 జిల్లా అధ్యక్షుడు గోపీనాథమ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆ సంఘ నాయకులు డీఈవో కార్యాలయం ఏడీ-2 వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం కొత్తగా ప్రవేశ పెట్టిన పరీక్షల నిర్వహణలో మూల్యాంకన పుస్తకాలు విద్యార్థులకు సరఫరా చేయడం అనేక సమస్యలకు దారితీస్తోందన్నారు. ఈ విధానం పాఠశాలల పని వేళల్లో జరగాల్సిన బోధన సమయాన్ని హరించే విధంగా ఉందన్నారు. గతంలో పరీక్ష పేపర్లు ఇంటి వద్దనే దిద్దే పద్ధతి ఉండేదన్నారు. ప్రస్తుతం అమలు చేస్తున్న విధానం వల్ల పాఠశాలల్లోని పుస్తకాలను ఇంటికి తీసుకువెళ్లలేని పరిస్థితి ఉందన్నారు. ఆన్‌లైన్ నమోదు, రిజిస్టర్ నమోదుతో పాటు జంబ్లింగ్ చేసే పని సైతం టీచర్ల పై నెట్టారన్నారు. ఈ కొత్త విధానం వల్ల మంచి ఫలితాలు సైతం రావడం లేదన్నారు. నష్టం కలగకముందే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్తియార్ అహ్మద్, నాయకులు నవీన్, జగదీష్ పాల్గొన్నారు.

నేడు నాట్ క్వాలిఫైడ్!



రెండ్రోజుల క్రితం పద్మావతి ఎస్జీటీగా క్వాలిఫైడ్ అయినట్టు చూపుతున్న ఆన్‌లైన్ సర్టిఫికెట్

పలమనేరు: బైరెడ్డిపల్లికి చెందిన మొగిలి భార్య సి.పద్మావతి బీసీ(ఏ) కేటగిరిలో ఎస్జీటీ పోస్టుకు ఎగ్జామ్‌స్కోర్, నార్మలైజేడ్, టెట్‌స్కోర్, వెయిటేజీ మొత్తం కలిపి 40.96గా క్వాలిఫై అయ్యి పోస్టు సాధించింది. కానీ ఏమి జరిగిందోగానీ శుక్రవారం ఆన్‌లైన్‌లో పరిశీలించగా ఆమెను నాట్ క్వాలిఫైడ్‌గా చూపెట్టారు. దీంతో బాధితురాలు లబోదిబోమంది.